క్లుప్తంగా

అమిత్‌షా సభను సక్సెస్ చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల మైదానంలో శనివారం జరిగే అమిత్‌షా సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బీ జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సభ ఏర్పాట్లను జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురుతుందన్నారు. అమిత్ షా సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కేపీ రాజు, వడ్ల నందు, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు విందు

- ఉపాధి కూలీలకు కోడికూరతో బువ్వ
- ముగింపు దశకు ప్రచారపర్వం



భోజనం వడ్డిస్తున్న నాయకులు

కుల్కచర్ల: పార్లమెంటు ఎన్నికల ప్రచార పర్వంలో పోలింగ్ తేదీ దగ్గర పడటంతో ఆయా పార్టీలు సరికొత్త రీతిలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 13వ తేదీ ఓట్ల పండుగ ఉండటంతో.. ఓటరు దేవుళ్లు ఎక్కడ ఎక్కువగా ఉంటే.. అక్కడికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కూలీల వద్దకు ఓ పార్టీ నాయకులు వెళ్లారు. కోడికూరతో భోజనం వడ్డించారు. క్షేమ సమాచారం కనుక్కున్నారు. తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల అధికార యంత్రాంగం ప్రచారపర్వంలో జరుగుతున్న ఉల్లంఘనల గురించి పెద్దగా పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా చేపడుతున్న కార్యక్రమాలను నిరోధించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా ప్రచారం నేటితో ముగియనుండటంతో ఇక ప్రలోభాల పర్వం ప్రారంభమైందని పలువురు పేర్కొన్నారు.

'అవినీతి ఊబిలో బీజేపీ ప్రభుత్వం'

తుర్కయంజాల్: పదేళ్ల బీజేపీ పాలనలో అవినీతి, అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒరుగంటి యాదయ్య ఆరోపించారు. శుక్రవారం తుర్కయంజాల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచురించిన 'అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వం' అనే పుస్తక ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చడంతో పాటు, సమాచార హక్కు చట్టంలో లేని అనేక నిబంధనలను మార్చారన్నారు. కార్పొరేట్ శక్తులకు రూ. 16వేల కోట్ల రుణమాఫీ, లోక్‌పాల్, లోకాయుక్త, చట్టాలను పట్టించుకోకపోవడం, అమి త్ షా కుమారుడు జైషా ఆస్తులు రెట్టింపవ్వడం, ఎలక్టోరల్ బాండ్ల పేరుతో పెద్ద ఎత్తున విరాళాలను సేకరించిందని విమర్శించారు.

'ఉపాధి'లో అక్రమాలు, అవకతవకలు!

యాచారం: ఉపాధి పనుల్లో అక్రమాలు, అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. యాచారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం జరిగింది. 24 జీపీల్లో 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు దాదాపు రూ. నాలుగున్నర కోట్లకు పైగా పనులు జరిగాయి. దీనికి సోషల్ ఆడిట్ అధికారులు ప్రతీ గ్రామంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో వెలుగులోకి వచ్చిన నిధుల దుర్వినియోగం, కూలీల ఇబ్బందులు, రైతులకు సమాచారం లోపం తదితర సమస్యలపై శుక్రవారం మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందం వివరాలు వెల్లడించారు. అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి పద్మావతి, అంబుడ్స్‌మెన్ సునీతా, విజిలెన్స్ అధికారి కొండయ్యతో పాటు యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కూలీలకు పే స్లిప్పులు సకాలంలో ఇవ్వకపోవడం, ఎంబీ రికార్డుల్లో నమోదు చేయకుండానే నిధులు మంజూరు చేయడం, రైతులకు సమాచారం ఇయ్యకుండానే వారి వ్యవసాయ భూముల్లో భూ అభివృద్ధి, వరద కట్టల నిర్మాణ పనులు చేపట్టడం, సంరక్షణ లోపం వల్ల ఆయా గ్రామాల్లో వందలాది మొక్కలు ఎండిపోవడం వంటి వివరాలను వెల్లడించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రూ. లక్షలాది నిధులు దుర్వినియోగమయ్యాయని, బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు మాయం



అనంతగిరిలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



యాలాల: మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకులు

- మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న కమలం పార్టీ
- పేదల సంక్షేమం పట్టని కేంద్రాన్ని నమ్మొద్దు
- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

నవాబుపేట: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మాయం అవుతాయని, తద్వారా బడుగు బలహీన వర్గాల జీవితాలు ఆగం అవుతాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డిలు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి ఎల్లకొండ, గంగ్యాడ, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీ హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, కుల మతాల మధ్య చిచ్చుపెడుతూ పల్లెల్లో అశాంతి నెలకొల్పుతుందని ఆరోపించారు. కేవలం దేవుడు, మతం పేరుతో ఎన్నికల్లో గెలవాలని చూస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, ఎన్నికల అనంతరం ఆరు గ్యారంటీలు వంద శాతం అమలవుతాయని వెల్లడించారు. చేతి గుర్తుకు ఓటువేసి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో నాయకులు వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, బందయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, ఆర్ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, కొండల్ యాదవ్, ప్రసాద్, రాంచద్రారెడ్డి, ఎండీ రఫీ, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

దేశం భద్రంగా ఉండాలంటే కాంగ్రెస్‌ను గెలపించాలి

పెద్దేముల్: దేశం భద్రంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీని గెలపించాలని ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అభ్యర్థించారు. మండల పరిధి మదనంతపూర్, దుగ్గాపూర్, నెల్లిగడ్డతండా, కొండాపూర్, మన్‌సాన్‌పల్లి తదితర గ్రామాల్లో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. పదేళ్ల కాలంలో దేశాన్ని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాల్లో దివాలా తీయించాయని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, అభివృద్ధిని ఆస్వాదించాలని కోరారు. ఇందులో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, సీపీఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుమిత్ర, మండల కన్వీనర్ కుమార్, రవి శంకర్, కుమ్మరి సాయులు, ఆనంద ఉన్నారు.

ఆగస్టులో రుణమాఫీ

యాలాల: ఆగస్టు నెలలో పక్కాగా రూ.2లక్షల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారని కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా అన్నారు. మండల కేంద్రంలోని జామా మసీదు ఆవరణలో మైనార్టీలతో సమావేశమయ్యారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో గ్రామ యూత్ అధ్యక్షుడు అశోక్ నాయీ, మోయిజ్, అహ్మద్, జిలానీ ఉన్నారు.

ప్రజలపై ధరల భారం

దోమ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య కోరారు. మండల పరిధి దిర్సంపల్లిలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పదేళ్ల కాలంలో ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని విమర్శించారు. జై జవాన్, జైకిసాన్ అంటూనే రైతులను, సైనికులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. నిత్యవసరా సరకుల ధరలు పెంచి, ప్రజలపై మోయలేని భారం మోపుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అభ్యర్థించారు. ఇందులో సీపీఎం నాయకులు సత్తయ్య, శేఖర్, శ్రీనివాస్, ప్రభు, మొగులయ్య ఉన్నారు.

వంశీచంద్‌ను గెలిపించాలి

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో మండల నాయకులు వీన్న, వెంకట్‌రెడ్డి, దస్తప్ప, వెంకటప్ప, నర్సింలు ఉన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని, లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కరెంట్ బిల్లులు కట్టొద్దు

పూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందని, కరెంటు బిల్లులను ఎవరూ కట్టవద్దని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధి పుడుగుర్తి గ్రామంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడారు. రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని, బీఆర్ఎస్, బీజేపీల ఫిర్యాదుతో ఈసీ ఆదేశాల మేరకు ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఎన్నికల అనంతరం రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయని తెలిపారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి ఎంపీటీసీ

యాలాల: బీఆర్ఎస్ పగిడియాల ఎంపీటీసీ ప్రభాకర్.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఇందులో బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, భీమప్ప, మాజీ ఉపసర్పంచ్‌లు నర్సింహులుగౌడ్, శ్రీనివాస్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్, మల్లప్ప, నర్సింలు, బసంత్ ఉన్నారు.

'మా నాన్నను గెలిపించండి'

కుల్కచర్ల: మా నాన్నను ఆశీర్వదించి, ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు సిద్ధార్థ్ రెడ్డి కోరారు. మండల పరిధి ఇప్పాయిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల ప్రదేశాలకు వెళ్లి ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి రంజిత్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, ఆయనను గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పార్టీ బ్లాక్ బీ-అధ్యక్షుడు భరత్ కుమార్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, తిర్మలాపూర్ ఎంపీటీసీ రాంలాల్ నాయక్, నాయకులు బాల్ రెడ్డి, కుమ్మరి స్వామి, శంకర్ ఉన్నారు.

రంజిత్‌ను గెలిపిద్దాం..



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించుకుని, అభివృద్ధిని ఆస్వాదిద్దామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సుభాష్‌నగర్ కాలనీలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే రంజిత్‌కు మనమంతా అండగా ఉండాలన్నారు. ఎంపీగా రంజిత్‌ను గెలిపించి, సీఎం రేవంత్‌రెడ్డికి చేవెళ్లను కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఇందులో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్ కుమార్ ఉన్నారు.

దేశానికి మోదీ చేసిందేమీ లేదు

ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీజేపీ పదేళ్ల పాలన కాలంలో దేశానికి చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి సుల్తాన్‌పూర్, ఖుదాన్‌పూర్‌లో ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీకి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని, దేశంలోని ఏ గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ చేసిన అభివృద్ధే నేటికీ కనిపిస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలోనూ ఉంటే దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. బీజేపీ మతాన్ని, రామున్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తుందని విమర్శించారు. ప్రజలు ఒకసారి ఆలోచించి, తమ విలువైన ఓటును అర్హులైన వారికి వేయాలని అభ్యర్థించారు. ఇందులో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి ఉన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

కళాకారులకు ఆర్థిక సహాయం

దోమ: ప్రాచీన కాలం నాటి వీధి నాటకాలను ప్రోత్సహించాలని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ కోరారు. శుక్రవారం మండల పరిధి మోత్కూర్ గ్రామంలో ప్రదర్శించిన శ్రీ వేంకటేశ్వర మహాత్యం వీధి నాటకాన్ని ఆమె వీక్షించారు. అనంతరం మాట్లాడారు. కళాకారులను ఆదరించి, వీధి నాటకాలను ప్రోత్సహించాలని సూచించారు. నాటకాలను వీక్షిస్తూ.. అందులోని సారంశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం కళాకారులకు ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రధాని మోదీకి చిత్రపటం అందజేత

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ నేతలు భారీ బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆధ్వర్యంలో ప్రధానికి షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కలిశారు. ప్రధానికి ఆయన చిత్రపటాన్ని అందజేశారు.

నవనీత్‌కౌర్‌పై ఫిర్యాదు

కడ్తాల్: కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ నవనీత్‌కౌర్‌పై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె వ్యాఖ్యలు దేశ ప్రజలతో పాటు, పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. తక్షణమే ఆమెపై కేసు నమోదు చేయాలన్నారు. కేఎస్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్ తదితరులున్నారు.

మతోన్మాద శక్తులను ఓడిద్దాం

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ శక్తులకు ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందొరెడ్డికి మద్దతుగా శుక్రవారం షాద్‌నగర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ పార్టీ కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. ఓట్ల కోసం మత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలో వస్తే దేశంలో ఇక ఎన్నికలు జరగవన్నారు. రాజ్యాంగానికి ప్రమాదమని, ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం
- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు



అనంతగిరి: ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. కాంగ్రెస్ చెబుతున్న అబద్ధాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, ప్రస్తుత ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్, కౌన్సిలర్ రామస్వామి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్‌రావు, వేణుగోపాల్, మల్లికార్జున్, మల్లేషం, కొళారి ఉన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్

మోమిన్‌పేట: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి మేకవనంపల్లిలో బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. అమలు సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీగా కాసానిని గెలిపించి, కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని కోరారు.

యంగ్‌లీడర్ ఆధ్వర్యంలో..

మర్పల్లి: బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు తమ మద్దతు ఉంటుందని యంగ్‌లీడర్ జిల్లా కో ఆర్డినేటర్ నిఖిల్ తెలిపారు. కాసానికి మద్దతుగా మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉండేదని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీల అమలులో విఫలమయిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, కాసానిని గెలిపించాలని కోరారు. అశోక్‌రెడ్డి, మాణిఖ్యం, శ్రీనివాస్, దీపక్, విజయ్‌కుమార్, నగేశ్, ప్రభాకర్ నరేష్ ఉన్నారు.

ముదిరాజ్‌ల ముద్దు బిడ్డ కాసాని

యాలాల: ముదిరాజ్‌ల ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండల పరిధి బెన్నూరు, కోకట్ గ్రామాల్లో మాజీ ఎంపీటీసీలు ఆవుటి శంకర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మహ్మద్ ముస్తఫా, మాజీ సర్పంచ్ పటేల్‌రెడ్డి, శరణుభూపాల్‌లు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పథకాలు ఎవరూ మరిచిపోలేరని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కాసానిని గెలిపించి, అభివృద్ధిని ఆస్వాదిద్దామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

మొరంమట్టితో మమ!



మొరంమట్టితో గోతులు పూడ్చి వేసిన కేరెళ్లి గ్రామ బీటీరోడ్డు

అదుపుతప్పుతున్న వాహనాలు

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

ధారూరు: గుంతలు ఏర్పడిన బీటీరోడ్డును మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. గతంలోనే మరమ్మతు చేయించినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కంకర, డాంబర్‌కు బదులు మొరం మట్టితో మమ అనిపించారని పలువురు ఆరోపించారు. మండల పరిధి కేరెళ్లి గ్రామం నుంచి అనంతగిరిగుట్ట మొదటి ఘాట్ వరకు నాలుగు చోట్ల మొరం మట్టిని పోసి, చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. మట్టితో గోతులు పూడ్చడం వలన వాహనాలు అదుపుతప్పి, వాహనచోదకులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ దారిలో నిత్యం వందలాది లారీలు, కార్లు, జీపులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, ఏదైనా ప్రమాదం జరగకముందే పటిష్టంగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కేంద్రాలు దూరం.. అసౌకర్యాల భారం



యాంకి పంచాయతీలోని పోలింగ్ కేంద్రం

వసతుల ఏర్పాటుకు అధికారుల కసరత్తు

దౌల్తాబాద్: మరో రెండు రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవస్థల మధ్య ఓట్లేసిన ఓటర్లకు మళ్లీ తిప్పలు తప్పేటట్లు లేవు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిధి పోలింగ్ బూత్‌లలో హడావుడిగా పనులు చేస్తున్నా.. అనేక చోట్ల తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, మూత్రశాలల పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ర్యాంపులు సైతం సరిగా లేవు. పల్లె ప్రజలు నాలుగైదు కిలో మీటర్ల దూరం నడిచి ఓట్లు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మూడు కిలో మీటర్ల దూరం..

మండల పరిధి 33 గ్రామపంచాయతీల్లో 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కొత్త పంచాయతీల్లో చాలా చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పాత జీపీల్లోనే కేంద్రాలు ఉండడంలో సౌకర్యాల లేమి, దూరభారంతో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. మండలంలో దేశాయిపల్లి పంచాయతీ కొత్తగా ఏర్పాటు కాగా.. దీనికి అనుబంధంగా మామిడికుంట, తండా ఉంది. ఇక్కడ 825 ఓటర్లు ఉన్నారు. అయితే ఈ పంచాయతీ ఓటర్లు.. మూడు కిలో మీటర్లు ఉన్న యాంకి పంచాయతీకి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలి. అక్కడ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు సరిగా లేవని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే బండివాడ పంచాయతీ కొత్తగా ఏర్పడింది. ఈ పంచాయతీ ఓటర్లు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న తిమ్మారెడ్డిపల్లి పంచాయతీకి వెళ్లి ఓటు వినియోగించుకోవాలి. పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు ఇప్పటికీ కల్పించలేదు. అయితే తాగునీటిని పోలింగ్ రోజున తాత్కాలిక ట్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. మిషన్‌భగీరథ కనెక్షన్లు ఉన్నా.. నీటి సరఫరా కావడం లేదు. ఏది ఏమైనా మరో 48 గంటల్లో తగిన ఏర్పాట్లు చేస్తారా లేదా అనేది వేచి చూడాలి.

బీజేపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

- మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- కమలం గుర్తుకు ఓటువేసి కొండాను గెలిపించండి
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు



బంట్వారం: జిన్నారంలో..



కుల్కచర్ల: ప్రచారం చేస్తున్న కమలనాథులు

కుల్కచర్ల: బీజేపీతోనే సబ్బండ వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జానకిరాం అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి, కొండాను ఆశీర్వదించి.. చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

కొండాకు మద్దతుగా ఎంఎస్పీ..

అనంతగిరి: బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ధీమా వ్యక్తంచేశారు. బీజేపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలు పట్టణం, మండల పరిధి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కొండాకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇందులో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా, శ్రీనివాస్, రవీందర్ ఉన్నారు.

జిన్నారంలో..

బంట్వారం: లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిన్నారం ఎంపీటీసీ బందెయ్య కోరారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన కోట్‌పల్లి మండల పరిధి జిన్నారంలో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని వెల్లడించారు. మరింత అభివృద్ధి జరగాలన్నా, అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలన్నా.. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీగా కొండాను గెలిపించాలని అభ్యర్థించారు.